గూడు పోయి.. గుండె పగిలి..

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ హెచ్చరించాడు.

డబ్బు ఇవ్వకపోతే ఇల్లు కూలగొట్టిస్తా

'ఇది నా ఇలాఖా.. నాకు మామూలు డబ్బు ఇవ్వకుండా ఇల్లు కట్టడానికి నీకెంత ధైర్యం.. నువ్వు ఇల్లు ఎలా కడ్తావ్. నీ అంతు చూస్తా.. నీ ఇంటిని పునాదులతో సహా కూల్చేయిస్తానం'టూ అధికార కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ బీఆర్ఎస్ బోరబండ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు సర్దార్‌ను బెదిరించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో సర్దార్‌పై కార్పొరేటర్ కక్షగట్టి అన్నంత పనిచేశాడు. టౌన్ ప్లానింగ్ అధికారులతో ఇంటిని కూల్చేయించాడు. ఇంటి మూడో అంతస్తు స్లాబ్, గోడలకు పెద్ద రంధ్రాలతో డిమాలిషన్ చేయించాడు. మూడో అంతస్తే కాదు.. మొత్తం ఇంటిని పునాదులతో సహా కూల్చివేయిస్తానని.. మున్సిపల్ డిపార్ట్ మెంట్ అంతా తన చేతుల్లో ఉందని సర్దార్‌కు ఫోన్ చేసి బెదిరించాడు. ఇల్లు అంతా కూల్చితే భార్యాబిడ్డలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, తమ్ముడికి నిలువునీడ లేకుండా పోతుందని కలత చెందాడు సర్దార్. మనోవేదనతో ఉన్న సర్దార్ బుధవారం రాత్రి ఇంటి మూడో అంతస్తుపై నుంచి కిందకు దూకేశాడు. దవాఖానకు తరలించగా.. అప్పటికే సర్దార్ మృతి చెందినట్లు నిర్ధారించారు.

అనాథల్ని చేసి తిరిగిరాని లోకాలకు..

భార్యాబిడ్డల్ని అనాథల్ని చేసి సర్దార్ బలవన్మరణానికి పాల్పడి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబసభ్యులతో పాటు స్థానికులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని ఓదార్చడం ఎవరితరమూ కావడం లేదు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు తోడుగా ఉండి కంటికి రెప్పలా కాపాడుకునే వాడు. జీ ప్లస్ టూ గా ఉన్న ఇంటిని మూడంతస్తులుగా నిర్మించి తమ్ముడికి పెళ్లి చేయాలని భావించాడు సర్దార్ మామూళ్ల కోసం బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వేధింపులకు చివరికి సర్దార్ బలైపోయాడు. సర్దార్ ఆత్మహత్య ఘటన స్థానిక ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. వారిలో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. బోరబండ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. బల్దియా అధికారులు, వెంటనే కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్‌ను అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తాం : డీసీపీ, విజయ్‌కుమార్

మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై బాబా ఫసీయుద్దీన్ అతని భార్య హబీబా సుల్తానా, పీఏ సప్తగిరిలపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు, స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన నేపథ్యంలో వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతుడు సర్దార్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని, అధైర్యపడొద్దని వారికి ధైర్యం చెప్పారు. ఈ కేసులో ఎంతటివారినైనా అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

బాబా గూండాగిరికి సర్దార్ బలి

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బోరబండ కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ గూండాగిరి, అక్రమాలకు బీఆర్ఎస్ బోరబండ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు మహమ్మాద్ సర్దార్ బలైపోవడం తనను ఎంతో బాధించిందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం మహమ్మాద్ సర్దార్ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

సర్దార్ మృతి ఆవేదన కలిగించింది

–మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి

సర్దార్ బలవన్మరణం తనకు తీరని ఆవేదనను మిగిల్చిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.

సైబర్ క్రైమ్ పెరిగింది..!

39 రకాల సైబర్ క్రైమ్‌లు గుర్తించాం..

- పిటిషన్ దర్యాప్తునకు జెడ్‌సీసీల ఏర్పాటు
- డీసీపీ ఆఫీసులో జోనల్ సైబర్ క్రైమ్‌సెల్
- 7 జోనల్ సైబర్ క్రైమ్ సెల్‌లను ప్రారంభించిన సీపీ సీవీ ఆనంద్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): మహానగరానికి ఒకే ఒక్క సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఉందని, ఇందులో 120 మంది మాత్రమే పనిచేస్తున్నారని, సైబర్ క్రైమ్‌లు పెరుగుతున్న స్థాయిలో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు సామర్థ్యం లేదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గురువారం కమిషనరేట్ పరిధిలోని ఏడు జోన్లలో జోన్ వారీగా జోనల్ సైబర్ క్రైమ్ సెల్‌లను సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా సైబర్ క్రైమ్ కేసులు విపరీతంగా పెరిగిపోయాయని, సుమారు పదిశాతం కేసులు పెరిగినట్లు చెప్పారు. 2015లో సైబర్ క్రైమ్ కేసులు 351 నమోదైతే, 2024లో 3111 నమోదైనట్లు తెలిపారు. పెరుగుతున్న సైబర్ క్రైమ్‌లను విచారించే స్థాయిలో సెంట్రల్ సైబర్ క్రైమ్ పీఎస్ లేకపోవడంతో జోనల్ వారీగా సైబర్ సెల్‌ను ఏర్పాటు చేయడానికి నిర్ణయించి నెలరోజులుగా సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఒక్కటే సైబర్ పీఎస్ ఉండడం వల్ల స్టేషన్‌కు వచ్చే చిన్నచిన్న కేసులు వదిలేయడం లేదా విచారణ లేకుండా పిటిషన్ తీసుకుని పట్టించుకోకపోవడం, పీఎస్‌లో కేసులు వస్తే సైబర్ క్రైమ్‌సామర్థ్యం లేక పిటిషన్‌ను సామర్థ్యం లేనందువల్ల తీసుకోవడంలో జాప్యం జరుగుతున్నదని సీపీ తెలిపారు. మూడునాలుగేళ్లుగా 39 రకాల సైబర్ క్రైమ్‌లను గుర్తించామని, ఇందులో సోషల్ మీడియా ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సైబర్‌క్రైమ్ సెల్ ఏర్పాటు చేయలేం కాబట్టి జోనల్ డీసీపీ ఆధ్వర్యంలో ఏడు సైబర్ క్రైమ్ సెల్స్ ఏర్పాటు చేస్తున్నామని, వీటిని ఆయా జోన్ డీసీపీలు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. రోజువారీ వస్తున్న ఫిర్యాదుదారుల నుంచి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ఆన్‌లైన్ మోసం, సైబర్ మోసాలకు సంబంధించి జెడ్‌సీసీలో జోన్ల వారీగా, స్టేషన్ల వారీగా తీసుకుని స్టేషన్లలో కేసులు నమోదు చేసి జెడ్‌సీసీలు పరిశోధిస్తాయని ఆనంద్ చెప్పారు. రూ.25వేల కన్నా తక్కువ వుంటే లీగల్ ప్రాసెస్ ప్రకారం దర్యాప్తు చేస్తారని తెలిపారు. జోన్ డీసీపీలు ఫిర్యాదులతో పాటు దర్యాప్తులను పర్యవేక్షించి టీమ్‌లను పంపించి వారి ద్వారానే అరెస్ట్‌లతో సహా అన్ని రకాల విచారణ ఇకపై జడ్‌సీసీ చేస్తుందని , లక్ష దాటితే ఆయా కేసులు సెంట్రల్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

భారత్‌లోనే ఉండేందుకు నైజీరియన్ల ప్లాన్..

హైదరాబాద్‌లో నేరాలు చేస్తున్న నైజీరియన్లను డిపోర్ట్ చేస్తున్నామని, డిపోర్ట్ చేసిన తర్వాత కూడా చాలామంది నకిలీ పాస్‌పోర్టులతో ఇండియాలో ప్రవేశించి ఏదో ఒక నేరం చేసి పట్టుబడి ఇక్కడే ఉండడానికి ప్లాన్ చేస్తున్నారని సీవీ ఆనంద్ చెప్పారు. చివరకు 498 కేసులోనైనా కేసు పెట్టించుకుని ఇక్కడే ఉండే ప్రయత్నం చేస్తున్నారని సీవీ తెలిపారు.బంగ్లాదేశ్‌కు చెందిన పౌరులు కూడా శరణార్థులుగా ఇక్కడికి వస్తున్నారని, వారి వ్యవహారాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లామని ఆనంద్ పేర్కొన్నారు. ఉగ్రవాద లింక్స్ ఉన్న సమీర్ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తున్నదని, హైదరాబాద్‌లో ఎన్ఐఏ నాలుగుచోట్ల సోదాలు చేసిందని, ఎన్ఐఏ విచారణ, సోదాలకు హైదరాబాద్ పోలీసుల సహకారం అడిగితే చేస్తామని చెప్పారు.

నగరంలో గన్స్ విక్రయం

ఆయుధాలను మీడియాకు చూపిస్తున్న సీపీ

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): నగరంలో గన్స్ విక్రయిస్తున్న ఇద్దరు యూపీ వాసులను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. యూపీ, రాంపూర్ సిటీకి చెందిన మహ్మద్ జీషాన్ అలియాస్ జీఖాన్ 2016లో యూపీ నుంచి కుటుంబ సమేతంగా హైదరాబాద్‌కు జీవనోపాధి కోసం వచ్చాడు. మూడు సెలూన్ దుకాణాలను నిర్వహిస్తున్న జీషాన్ తన వ్యాపారాల్లో చేదోడువాదుడుగా ఉండేందుకు యూపీ నుంచి తనకు తెలిసిన మహ్మద్ అమీర్‌ను పిలిపించాడు. ఇద్దరు విలాసవంతమైన జీవితం గడుపుతూ చెడు అలవాట్లకు బానిసయ్యారు. తమ వ్యాపారంలో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని సంపాదించేందుకు ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా యూపీలో ఈజీగా లభించే తపంచాలను తక్కువ ధరకు కొని హైదరాబాద్‌లో విక్రయించాలని ప్లాన్ చేశారు. యూపీలో రాంపూర్ సిటీకి చెందిన అర్షిఖాన్‌ను సంప్రదించారు. కొన్ని రోజుల క్రితం జీషాన్, అమీర్ యూపీ వెళ్లి ఐదు కంట్రీమేడ్ తుపాకులు కొని నగరానికి తీసుకొచ్చారు. జీషాన్ వ్యవహారంపై అనుమానం రావడంతో మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు పక్కా సమాచారంతో జీషాన్ ఇంట్లో గురువారం ఉదయం సోదాలు నిర్వహించగా అతడి వద్ద ఐదు తపంచాలు, 13 లైవ్ రౌండ్స్, ఐదు షెల్స్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఎస్ఓటీ అదనపు డీసీపీ షకీర్ హుస్సేన్ ఉన్నారు.

డ్రగ్స్, గంజాయి పట్టివేత

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న మహిళను అబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి 2.06గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం.. కుత్బుల్లాపూర్ మండలం సీఎన్ఎన్ తండాకు చెందిన ఫర్జానా బంజారాహిల్స్‌లోని మధు వద్ద డ్రగ్స్‌ను కొనుగోలు చేసి, సీఎన్ఎన్ తండాలో విక్రయిస్తుంది. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం తండాలోని ఫర్జానా నివాసంపై దాడులు చేసి నిందితురాలిని అరెస్టు చేసి, డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నగరంలోని మలక్‌పేటలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. రూ.2.5లక్షల విలువ చేసే 1.3కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ జానీమియా, షేక్ నజీర్, రంగారెడ్డి జిల్లాకు చెందిన పెద్ద గొల్ల శ్రీకాంత్ మలక్‌పేటలో గంజాయి వ్యాపారం చేస్తున్నారు. గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. కేసును మలక్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

లైంగికదాడి వీడియోలు బయటపెడ్తా..

బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,మే 29: మత్తుమందు ఇచ్చి మహిళపై లైంగికదాడికి పాల్పడడంతో పాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 7లో నివాసం ఉంటున్న మహేంద్ర వర్ధన్‌కు రెండేళ్ల క్రితం ఫేస్‌బుల్‌లో మహిళతో పరిచయం ఏర్పడింది. వారిద్దరూ ఓయాలో కలుసుకున్నారు. వారి మధ్య స్నేహం ప్రారంభమయింది. కాగా ఏడాదిన్నర క్రితం తన ఇంటికి భోజనానికి పిలిచిన మహేంద్రవర్ధన్ ఆమెకు మత్తుమందు ఇచ్చాడు. మహిళ మత్తులోకి జారుకున్న తర్వాత లైంగికదాడికి పాల్పడడంతో పాటు వీడియో, ఫొటోలు తీశాడు. అప్పటినుంచి ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు గుంజుతున్నాడు. ఇప్పటివరకు రూ.20లక్షలు వసూలు చేసిన మహేంద్రవర్ధన్ తనకు రూ.కోటి ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నాడు. దీంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీఏ వేలంపాటలో రికార్డు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 29: కూకట్‌పల్లి ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన నంబర్ల ఆన్‌లైన్ వేలంపాటలో టీజీ 8ఏసీ 0006 నంబర్‌కు రికార్డు స్థాయిలో రూ.20,17,127 లక్షల ధర పలికినట్లు ఎంవీఐ శ్రీనుబాబు తెలిపారు. కొత్త నంబర్లతో సిరీస్ ప్రారంభం కావడంతో.. కొత్త నంబర్లను తీసుకోవడానికి 70 మంది ముందుకు రాగా..51 మంది నంబర్లను ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకున్నారు. గురువారం 15 నంబర్ల ను కేటాయించేందుకు నిర్వహించిన వేలం పాటలో ఒక్కరోజే రూ.34,17,247 లక్షలు రాష్ట్ర ఖజానాకు చేరినట్లు తెలిపారు. అత్యధికంగా టీజీ 08 ఏసీ 0006 నంబర్‌ను లడియా డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకోగా, టీజీ 088 క్యూ 9999 నంబర్ ను రూ.6,80,000 లక్షలకు రత్నదీప్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, టీజీ 08 ఏసీ 0001 నంబర్‌ను రూ.2,01,116 లక్షలకు శ్రీకృష్ణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సొంతం చేసుకున్నట్లు తెలిపారు.

కొడుకు చదువు సాకుతో వేధింపులు

బంజారాహిల్స్,మే 29: కొడుకు చదువు గురించి వాకబు చేసే సాకుతో మహిళకు ఫోన్లు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే..యూసుఫ్‌గూడ సమీపంలోని ప్రగతి నగర్‌లో నివాసం ఉంటున్న మహిళ బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. ఆమె కొడుకు జూబ్లీహిల్స్‌లోని ఓబుల్ రెడ్డి స్కూల్‌లో చదువుతున్నాడు. అతడితో పాటు చదువుకునే విద్యార్థి తండ్రి మురళి అప్పుడప్పుడు ఆమెకు ఫోన్లు చేస్తూ కొడుకు చదువు గురించి వాకబు చేస్తుండేవాడు. కాగా ఇటీవల అతడి ప్రవర్తనలో తేడా రావడంతో పాటు వాట్సాప్ కాల్స్ చేస్తూ ఆమెను విసిగించడం ప్రారంభించాడు. మురళి తన నంబర్‌ను ఎందుకు బ్లాక్ చేశావంటూ నిలదీశాడు. హద్దుమీరి ప్రవర్తిస్తున్నావంటూ హెచ్చరించి ఇంటికి వెళ్లిపోయింది. కాగా అతడి పద్ధతి మార్చుకోకపోవడంతో పాటు ప్రేమిస్తున్నానంటూ మెసేజ్‌లు పంపించడం ప్రారంభించాడు. విషయం భర్తకు చెప్పిన మహిళ ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టారు.

సీఎండీ పేరుతో వాట్సాప్ మెసేజ్..

బంజారాహిల్స్,మే 29: కార్పొరేట్ ఆస్పత్రి సీఎండీ పేరుతో వాట్సాప్ డీపీ పెట్టుకుని సంస్థకు చెందిన అధికారివద్దనుంచి రూ.22లక్షలు కాజేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వికాస్ మహేశ్వరి అనే వ్యక్తికి ఈనెల 14న వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆస్పత్రి సీఎండీ డా.రమేశ్ కంచర్ల పేరుతో పాటు అతడి డీపీతో ఉన్న వాట్సాప్ మెసేజ్‌లో అర్జెంట్‌గా తాను పంపిస్తున్న దేవ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ అకౌంట్ నంబర్‌కు రూ.22లక్షలు పంపించాలంటూ చెప్పారు. తమ సీఎండీ మెసేజ్‌గా భావించిన వికాస్ మహేశ్వరి తమ సంస్థ అకౌంట్ నుంచి డబ్బులను పంపించాడు. కొంతసేపటి తర్వాత ఈ విషయాన్ని సంస్థ సీఎండీకి కాల్ చేసి చెప్పగా తాను ఎలాంటి మెసేజ్ పంపలేదని పేర్కొన్నాడు. దీంతో తాము డబ్బులు పంపిన బ్యాంక్ అకౌంట్‌ను పరిశీలించగా రాంచీకి చెందిన అకౌంట్‌గా తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాలికొదిలేసిన హెచ్ఎండీఏ

(మొదటిపేజీ తరువాయి)

రెవెన్యూ తగ్గిపోవడంతో అదనపు ఆదాయం లేక అప్పులు చేస్తే గానీ కొత్త ప్రాజెక్టులను చేపట్టే వీల్లేకుండా పోయింది. ఇలా నిత్యం రియల్ ఎస్టేట్ లావాదేవీలపై ఆధారపడి రాష్ట్ర ఖజనాకు ఆదాయం సమకూర్చే హెచ్ఎండీఏలో ఉన్న విలువైన భూముల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

ఎస్టేట్‌లో సమన్వయ లోపం...

హెచ్ఎండీఏకు చెందిన స్థిరాస్తులను పర్యవేక్షించే ఎస్టేట్ విభాగంలో నెలకొని ఉన్న సమన్వయ లోపం ఇప్పుడు ఆ భూముల పాలిట శాపంగా మారింది. ఏడాదిన్నరకొసారి ఇతర జిల్లాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిపోయే అధికారులతో అసలు ఎస్టేట్ విభాగంలో పర్యవేక్షణ కరువైతుంది. ఉన్నత స్థాయి అధికారుల సమీక్ష సమావేశాలు నిర్వహించినప్పుడు కాగితాలపై కనిపించే భూములు... క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులలో ఉంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 3899 ఎకరాలు, హైదరాబాద్ జిల్లా పరిధిలో 37 ఎకరాలు, మెదక్ జిల్లా పరిధిలో 437 ఎకరాల చొప్పున మొత్తంగా 4374 వేల ఎకరాల భూమి ఉన్నట్లు నివేదిక చెబుతుండగా... ఇందులో మెజార్టీ జాగాలపై కోర్టు వివాదాలే ఉంటే, మిగిలిన ఖాళీ జాగాలను ఆక్రమణలతో హెచ్ఎండీఏకు లేకుండా చేస్తున్నారు. ఇలా వేల కోట్లు విలువ చేసే భూముల విషయంలో కమిషనర్ ఉన్నత స్థాయిలో సమీక్షించి, భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుతం హెచ్ఎండీఏ అధీనంలో ఉన్న భూములు, జీయో ఫెన్సింగ్, హద్దుల నిర్ధారణ, ఆక్రమణల తొలగింపుపై దృష్టి పెట్టకపోవడంతో... భూములకు రక్షణ లేకుండా పోతుంది.

బాబా ఆగడాలు బోలెడు..!

బరితెగించిన బాబా ఫసియొద్దీన్

లంచం ఇవ్వకంటే ఇండ్లు కూల్చివేత

సహకరిస్తున్న బల్దియా సిబ్బంది

పార్టీ మారాలంటూ బెదిరింపులు

వేధింపులు భరించలేక

బీఆర్ఎస్ నాయకుడు బలి

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): బోరబండ కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అక్రమాలు అన్నీ ఇన్నీ కావు.. బస్తీలో ఉండే పేదలను లంచాల కోసం పీల్చి పిప్పి చేస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాడంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇండ్లు కట్టినా, మరమ్మతులు చేసినా అడిగినంత లంచం ఇవ్వాల్సిందేనంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. లంచం ఇవ్వలేదంటే బల్దియా సిబ్బందికి చెబుతూ..ఇండ్లు కూల్చేయడం, ఇంటి ముందు ఉండే నిర్మాణా సామగ్రిని పాడుచేయించడం, జరిమానాలు వేయించడం.. అతడి వేధింపులు ఒకటి కాదంటూ స్థానికులు వాపోతున్నారు. అతడి కుటుంబ సభ్యులు, పీఏ సైతం ఈ వేధింపుల్లో పాలుపంచుకుంటున్నారంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతడి వేధింపులతో బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకుడు మహమ్మద్ సర్దార్ బలవన్మరణానికి పాల్పడ్డాడు.

– బోరబండ వినాయకరావునగర్‌లో 75 గజాల స్థలంలో తనకున్న జీప్లస్ టు ఉన్న ఇంటిపై మరో రెండు అంతస్తులు కడుతుంటే అక్కడకు జీహెచ్ఎంసీ అధికారులను పంపి ఇంటిని సీజ్ చేయించాడని బోరబండకు చెందిన న్యాయవాది కృష్ణమోహన్ వివరించారు. తాను బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నందుకు తనను తీవ్రంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. తన ఇంటిని కార్పొరేటర్ ఫసియుద్దీన్ సీజ్ చేయించడంతో ఇండ్లు లేక తన భార్యతో పాటు ఐదేండ్ల కుమారుడిని తన స్వస్థలం సిద్దిపేటకు పంపి, తాను చెట్ల కింద , తెలిసిన వారి ఇండ్లలో తలదాచుకుంటూ కాలం నెట్టుకొస్తున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

– బోరబండ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అయిన సైట్‌ఫోర్, ఫైవ్ కాలనీ అధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్ తన 100 గజాల స్థలంలో ఇండ్లు కడుతుంటే బల్దియా అధికారులను పంపించి కూల్చేయించాడు. అలాగే బోరబండ బస్‌స్టాప్ వద్ద టెంకాయల దుకాణాన్ని నిర్వహించే రమేశ్‌పై ఐదు కేసులు పెట్టించి వేధింపులకు గురిచేస్తూ వీధి వ్యాపారులపై కూడా తన దురాగతాలను సాగిస్తున్నాడంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. బోరబండ వీకర్ సెక్షన్‌లోని పాన్‌షాప్‌ను నిర్వహించే ఫిరోజ్ పాన్ దుకాణాన్ని అధికారులతో అక్కడి నుంచి తొలగింపచేశాడు. గతంలో ఓ వైద్యురాలిని పోలీసులతో కలిసి కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ పీఏ బెదిరించి.. లక్ష రూపాయలు డిమాండ్ చేశాడు. చివరకు రూ. 50 వేలు వసూలు చేశాడని స్థానికులు ఆరోపించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన..

కార్పొరేటర్ ఫసియుద్దీన్ అరాచకాలకు బలైన సర్దార్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, కార్పొరేటర్ అరాచకాలను నిరసిస్తూ స్థానిక ప్రజలు నల్ల బ్యాడ్జీలతో సర్దార్ అంతిమ యాత్రలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

దాచిపెట్టమంటే.. దోచేశాడు..!

దోపిడీ ముఠా అరెస్ట్

రూ. 28.20 లక్షలు స్వాధీనం

వివరాలను వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): డబ్బులు తన దగ్గర దాచిపెట్టుకోమన్న పాపానికి ఆ డబ్బులను ఓవ్యక్త దోచేశాడు. గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ జకీర్ తన అల్లుడు కబీర్‌కు ప్లాట్ కొనేందుకు కావాల్సిన డబ్బులు రూ. 29 లక్షల నగదు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయంపై జకీర్ తన కొడుకు ఇలియాస్ మాట్లాడుకొని తమ బంధువైన ఓబేద్ ద్వారా ఆ డబ్బును కబీర్‌కు పంపించారు. ఓబేద్ డబ్బులు తీసుకొని వెళ్తున్న సమయంలోనే కబీర్ నగరంలో లేడనే సమాచారం వచ్చింది. దీంతో ఆ డబ్బును ఎర్రకుంటలో నివాసముండే ఇలియాస్ స్నేహితుడైన ఖదీర్‌కు అప్పజెప్పాలని ఓబేద్‌కు సూచించారు. ఓబేద్‌ను ఖదీర్‌తో మాట్లాడించాడు. డబ్బులు తన వద్ద దాచిపెట్టుకోవడానికి ఖదీర్ ఒప్పుకోవడంతో వాటిని అతడికి అప్పగించేందుకు ఓబేద్ బయలుదేరాడు. దీంతో ఖదీర్‌కు ఆ డబ్బుపై కన్ను పడింది.. వెంటనే ఆ డబ్బును ఎలాగైనా కొట్టేయాలని ప్లాన్ చేసి విషయాన్ని తన మామ అయిన హబీద్ హరూన్‌కు వివరించాడు. డబ్బు కొట్టేసేందుకు చాంద్రాయణగుట్టకు చెందిన వర్దన్, రషీద్ ఖాన్, రషికాంత్ బర్దన్ అలియాస్ కిట్టులతో మాట్లాడారు. తాము చెప్పినట్లు ఒక వ్యక్తి వద్ద నుంచి డబ్బుల బ్యాగ్ కొట్టేస్తే ఒక్కొక్కరికీ రూ. 20 వేలు ఇస్తానంటూ ఒప్పందం చేసుకున్నారు. దీంతో డబ్బులు తీసుకొని వస్తున్న ఓబేద్ ఎక్కడున్నాడు, ఎలా వస్తున్నాడనే విషయాలను ఖదీర్, మామ ఆరా తీస్తూ ఆ విషయాలను తమ గ్యాంగ్‌కు చేరవేశారు. మార్గ మధ్యలో ఓబేద్ వద్ద ఈ ముగ్గురు వ్యక్తులు రూ. 29 లక్షల బ్యాగ్‌ను దోపిడీ చేసి పరారయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు దోపిడీకి పాల్పడ్డారంటూ ఇలియాస్ బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అసలు సూత్రదారి ఖదీర్ అని తేలడంతో లోతైన దర్యాప్తు జరపడంతో తమ దోపిడీ స్కెచ్‌ను వివరించారు. దీంతో ఖదీర్, హబీద్ హరూన్, వర్దన్, రషికాంత్ బర్దన్‌లను అరెస్ట్ చేశారు, రషీద్‌ఖాన్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ. 28.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

జ్యోతిష్యం

★మీ ఇంట్లో ఏవైనా సమస్యలా? వెంటనే మాతాజీని కలవండి... లేదా సంప్రదించండి... 100% మీ సమస్యలు పరిష్కరింపబడతాయి... నమ్మకంతో రండి. మా సర్వీసెస్: ప్రేమవివాదాలు, భార్యాభర్తల వివాదాలు, అత్తాకోడళ్ల గొడవలు, వ్యాపార సంబంధిత గొడవలు లేక నష్టాలు, భూవివాదాలు, కోర్టుకేసులు, శత్రువులచే నష్టపోవడం లేదా ప్రయోగం చేయబడటంవల్ల బా